రేపే మా ఆఫీసుకు కొత్త మేనేజరు వస్తున్నాడన్న వార్త తెలిసినప్పుటినుండి మా స్టాఫ్‌లో ఎవరికి పని చేయబుద్ధికాలేదు. కారణం రాబోయే కొత్త మేనేజరు గురించి మా కొలీగ్ హరి చెప్పిన విషయాలే. రైతులకు కావలసిన ఎరువులు, మందులు తయారుచేసే కంపెనీ యొక్క ఏరియా సేల్స్ ఆఫీసుమాది. మా మేనేజరు వెంకటేశంగారు, హెడ్‌క్లర్క్ పరంధామయ్యగారు, అకౌంటెంట్ సత్యం అనే నేను, క్లర్క్ హరి, టైపిస్టు రమణి, అటెండర్ నారాయణ, ఇదీ మా స్టాఫ్. మా మేనేజరు వెంకటేశంగారు చాలా మంచిమనిషి. ఎవరినీ పల్లెత్తుమాట అనేవారు కాదు. ఎవరైనా ఏదైనా ఆఫీసు పనిలో తప్పు చేస్తే ఆయన స్వయంగా వచ్చి ఆ తప్పును ఎలా సరిచేయాలో చూపించేవారు. వీలయితే ఆయనే చేసేవారు. అందుకే ఆయన్ను మేము ''గోమాత'' అనేవారం. అంటే అంతటి సాధువన్న మాట. మా ఏరియాలో మా కంపెనీసేల్స్ తగ్గాయని వాటిని పెంచేందుకు కొత్తమేనేజరును వేశారని హెడ్ ఆఫీసులోని తనకు తెలిసిన వ్యక్తి చెప్పాడని చెప్పాడు హరి. అంతేకాదు కొత్త మేనేజరు పేరు నరసింహమని, పేరుకు తగినట్లే వుంటాడని, అతనికి ఇంతకు ముందు పనిచేసినచోట చండశాసనుడని, సింహమని యింకా ఏవేవో బిరుదులున్నాయని, ఆయన యింతకు ముందు పనిచేసిన చోట ఆయన ట్రాన్స్‌ఫర్ అయిన విషయం తెలియగానే వేడుకలు జరుపుకున్నారని తెలిపాడు. ఇవన్నీ విన్న తరువాత మాకు అతన్ని గురించి కొద్దిగా భయం మొదలయింది.




# చండశాసనుడు

ముక్త

మరునాడు తొమ్మిదిన్నర కంతా ఆఫీసు చేరుకు న్నాను. అప్పటికే మిగతావారు వచ్చివున్నారు. నాసీటు, టేబుల్ మీది దుమ్ము దులుపుకుని కూర్చున్నాను. మా అటెండరు నారాయణ పరమ బద్ధకస్తుడు. ఆఫీసులో దుమ్ము సరిగా దులపడు. ఎక్కడిదక్కడ అలాగే వుంటుంది. 'ఏంటిది' అంటే 'అదంతే' అంటాడు. మనమే మన సీట్లో దుమ్మును దులుపుకుని కూర్చోవాలి. లేదంటే లారీల్లో ప్రయాణించిన వారిలా తయార వుతాం. పది గంటలు కావస్తుండగా కారు వచ్చి ఆగింది. అందులోనుండి మా గోమాతగారు, చేతిలో యింతలావు కర్ర వూపుకుంటూ దిగిన వ్యక్తితో లోపలకొ చ్చారు. ఆయన్ను కొత్త మేనేజరుగా మాకు పరిచయం చేశారు. 'గుడ్మాణింగ్ సార్.' అంటూ మేమతన్ని విష్ చేశాం. 'గుడ్మాణింగ్...' 'గుడ్మాణింగ్' అని ఆయన అంటున్నప్పుడు ఆయన మీసాలు అచ్చం 'పులిమీసాల్లా కదులుతున్నాయని నాకనిపించింది. కొత్త మేనేజరు వచ్చినందుకు, పాత మేనేజరు వెళుతున్నందుకు చిన్న సైజు పార్టీ చేసుకున్నాం. అందరితో నవ్వుతూ సరదాగా మాట్లాడుతున్న ఆయన్ను చూసి మా హరి చెప్పిన విష యాలు అపద్ధమేమో అనిపించాయి నాకు. ఆరోజు సర దాగా గడిచిపోయింది. సుఖాల వెంటనే కష్టాలుంటా యన్న విషయం మాకు ఆయన వచ్చిన కొన్ని రోజుల తరువాత కానీ అర్థం కాలేదు.

మరునాడు పెందలాడే ఆఫీసుకు చేరుకున్నాను. అప్పటికి హరి తప్ప మిగ తావారు వచ్చివున్నారు. యధాప్రకారం సీట్లో దుమ్ముదులుపుకుని కూర్చు న్నాను. కొత్త మేనేజరు ఆఫీసులోనికి రావడము, హాల్లో గడియారం ఠంగ్..ఠంగ్.. మని పది గంటలు కొట్టడం జరిగింది. చేతిలోని రూళ్ళకర్రను తిప్పుకుంటూ, బూట్లు టకటక లాడించుకుంటూ వచ్చిన ఆయనకు 'గుడ్మా ణింగ్' చెప్పాం. గుడ్మాణింగ్ చెపుతూ తన క్యాబిన్‌లోనికి వెళ్లాడాయన. మా ఆఫీసు స్టాఫ్ సీట్లన్నీ ఒకే హాలులో వుంటాయి. ఒక మూలకు మేనేజరు అద్దాల క్యాబిన్ వుంటుంది. లోపల ఏం జరుగుతుందో కనపడుతుంది కానీ వినపడదు. ఆయన లోపలికి వెళ్ళిన రెండు సెకన్లకే బెల్లు కొట్టాడు. మా నారాయణ తాపీగా లోపలకు వెళ్ళాడు. లోపలకు వెళ్ళిన నారాయణకు కొత్త మేనేజరు తన చేతిలోని కర్రతో నారాయణ చేతిమీద బాదాడు. నారాయణ చప్పున తనచేతిని షర్టులో దాచుకున్నాడు. చూస్తున్న మాకు నోటమాటరాలేదు. అద్దాల రూము కాబట్టి శబ్దం బయటకు రాలేదు కానీ, నారాయణ సగం ఊరికి వినపడేంతలా అరచి వుంటాడని అనిపించింది నాకు. తర్వాత మేనేజరు చెప్పగానే బయటకు వచ్చి బట్ట తీసుకుని తిరిగి లోపలకెళ్ళాడు. అతడు బట్టకోసం వచ్చినపుడు పెసరకాయ ల్లాంటి అతని చేతివేళ్లు బెండకాయ సైజుకు వుండటం చూశాను. టేబుల్ మీద దుమ్ము సరిగా దులపనందుకే అతన్ని తన చేతి కర్రతో కొట్టాడని మాకు అర్థమయింది. అతని చేతికి కర్ర ప్రయోగం కూడా అర్థమ యింది మాకు. ఇంతలో మా హరి వచ్చాడు. వాడికి విషయం స్పీడుగా, టూకీగా చెప్పాను. అది విన్న వాడి ముఖంలో భయం కనిపించింది. ''లేటుగా వచ్చినం దుకు నాకేం శిక్ష వేస్తాడో? వస్తా గురూ... ఇంటికెళ్లి లీవు లెటరు పంపుతాను.'' అంటూ వాడు వెనుతిరిగాడు. ఎప్పుడు వాడిని చూసి వచ్చాడోగానీ మేనేజరు 'మిష్టర్ హరీ' అంటూ పిలిచాడు. కాళ్లకు ఆర్క్ వెల్డింగ్ చేసిన వాడిలా అక్కడే నిలబడిపోయాడు హరి.

''గుడ్మాణింగ్ సార్.'' గొంతు పెగుల్చుకుని



అన్నాడు హరి.

''గుడ్మార్నింగ్ '' అంటూనే ''ఎందుకు ఆలస్యం అయింది.'' అన్నాడు మేనేజరు.

''బండి పంచరయింది. వేయించుకొచ్చేసరికి ఆలస్యమయింది'' కూడదీసుకుంటూ హరి జవాబు.

'ఇలారా..' అన్న మేనేజరు మాటకు అతనివైపు చూసిన హరికి అతనిచేతిలో కర్రలేక పోవడంతో ధైర్యం కూడదీసుకుంటూ అతని దగ్గరకు వెళ్లాడు. ఏం జరుగుతుందా అని సస్పెన్సు సినిమా చూసినట్లు చూస్తున్నాం మేము.

ఆయన మావైపు చూస్తు ''ఏం. ఇక్కడేమన్నా కోతులాడుతున్నాయా'' అనడంతో మేమంతా ఠక్కున తలలు వంచి ముందున్న ఫైళ్లలోకి తొంగిచూడసాగాం. కానీ మా చెవులను రిక్కించి వారి మాటలు వింటున్నాం.

''పంచరయితే వేయించుకునేందుకు యింత లేటా. నిజం చెప్పు. ఎందుకు ఆలస్యం అయింది'' హూంకరించాడు ఆయన. ఆ మాటతో హరిగాడి నోరు పెగలలేదు. యింతలో ''ఠంగ్'' మని శబ్దం వచ్చింది. అంతలోనే పదిన్నరయిందా... అనుకుంటూ యాధాలాపంగా గడియారం వంకచూశాను. అది పది యిరవై చూపుతోంది. ఎప్పుడూ లేంది పదియిరవైకే గంట కొట్టిందే యిది. దీన్ని రిపేరు చేయించాలి అనుకుంటూ పరంధామయ్యగారి వంక చూశాను. మేనేజరు పిడికిలి బిగించి వుండటం, హరి నడినెత్తి తడుముకుంటూ వుండటంతో నేను అంతకుముందు విన్న శబ్దం గడియారం కొట్టింది కాదని, మేనేజరు హరికి మొటిక్కాయ వేసిన తాలూకు శబ్దమని గ్రహించడానికి పది సెకండ్లు పట్టింది నాకు.

''ఇంకోసారి లేటుగా వచ్చావంటే పనిష్మెంట్ తీవ్రంగా వుంటుంది. వెళ్లు. వెళ్లి పనిచూడు'' అని అరిచాడు కాదు కాదు గర్జించాడు నరసింహం ఉరఫ్ సింహం.

ఈ పరిస్థితుల్లో 'కాఫీకి' పోవడానికి కూడా భయపడి ఎవరి సీట్లలో వాళ్లుండిపోయాం. పది నిమిషాలకొకసారి నశ్యం పీల్చే పరంధామయ్యగారు సిగరెట్ తాగే హరి అసలు తమకు ఆ అలవాటే లేనట్లు వున్నారు. సరిగ్గా ఒంటిగంటకు సింహం భోజనానికి అటు వెళ్లగానే యిటు అంతా పరంధామయ్యగారి చుట్టూచేరాం.

మనం యిన్నాళ్లు 'గోమాత' గారు మేనేజరుగా వుండటంతో యిష్టమొచ్చినట్లు ప్రవర్తించాం. యిప్పుడున్నది గోమాతకాదు సింహం. తేడాలొస్తే నమిలేస్తుంది. జాగ్రత్తగా పనిచేసుకోండి. ఇతనికి యింకా యిటువంటి పద్ధతులు ఎన్ని తెలుసో?'' గాఢంగా నశ్యం పీలుస్తూ శలవిచ్చారాయన. హరి నడినెత్తిన జుట్టులో టమోటా దాచుకున్నట్లుంది బుడిపె. సిగరెట్ను గట్టిగా పీలుస్తూ గుప్పు... గుప్పు.. మని పొగవదులుతున్న హరి కళ్లల్లో లోకాన్ని జయించినంత ఆనందం కనిపించింది నాకు. తిరిగి రెండుకు పదినిమిషాలుండగానే ఎవరిసీట్లల్లో వారు కూర్చున్నాం. సరిగ్గా రెండుకు వచ్చింది సింహం. ఇక ఆరోజుకేం జరగలేదు. మధ్యాహ్నం భోజనానికి వెళ్లి ఒక కునుకు తీసి తాపీగా వచ్చేమేము యికనుండి క్యారియర్లు తెచ్చుకోవాలని అనుకున్నాము. సాయంత్రం ఆఫీసు కాగానే అందరం తలో క్యారియర్ కొనుక్కుని ఇళ్లకు బయలుదేరాం.

మరునాడు తొమ్మిదిన్నరకే ఆఫీసు చేరుకున్నాను. అప్పటికే మిగతావారంతా వచ్చివున్నారు. నిజం చెప్పొద్దూ, మేము ఇంతటి పంక్చువాలిటీని యింతవరకు పాటించలేదు. ''దేవుడికన్నా దెబ్బే గురువు'' అని మన పెద్దలు ఊర్కే అనలేదు. నా సీట్లోకి చూసి అదిరిపడ్డాను. కారణం నా టేబుల్, సీటు నీటుగా అద్దంలా ''తళ'' ''తళ'' మెరుస్తున్నాయి. ఆఫీసులో ఎక్కడా దుమ్మున్నది కనిపించడంలేదు. ఇక నారాయణ జన్మలో దుమ్ము నీటుగా దులపకుండా వుండడు అనుకున్నాను. సరిగ్గా హాల్లో గడియారం పది గంటలు కొడుతుండగా ఎంటరయింది సింహం. అందరం 'గౌరవంగా' అనేకంటే 'భయంగా' గుడ్మార్నింగ్ చెప్పామనడం సబబు.

మధ్యాహ్నం మూడు గంటలకు సర్క్యులర్ వచ్చింది. సాయంత్రం 5 గంటలకు మీటింగ్ వుందని. వచ్చీరాగానే మీటింగేంటి అనుకున్నాము. అయినా ఒకరితో ఒకరం మాట్లాడుకోలేదు. కారణం అద్దాల్లోనుండి చూసి సింహం వచ్చి ఏం శిక్ష విధిస్తాడోనని. సాయంత్రం 5 గంటలకు అందరం సింహం క్యాబిన్లో సమావేశమయ్యాం.

''ఈ ఏరియాలో మన కంపెనీ తాలూకు సేల్సు చాలా తక్కువగా వున్నాయని, వాటిని పెంచడానికి మనం తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చిద్దామనే ఈ మీటింగ్ ఏర్పాటుచేశాను. నాకు మొదటినుండి అనుమానం ఏమిటంటే మీకు మన కంపెనీ తయారుచేసే ఎరువుల, క్రిమిసంహారక మందుల గురించి ఎంతవరకు తెలుసో అని. మొదట ఆ అనుమానం తీర్చుకుని తరువాత విషయాలు మాట్లాడుదాం'' అంటూ లేచి అటు యిటు తిరుగుతూ ''మిస్టర్ హరి! మన కంపెనీ తయారుచేసే మందుల్లో బంక పురుగును నివారించే మందు ఏది? స్పెల్లింగుతో సహా చెప్పు.'' మొదటి బాంబు హరి మీదనే వేశాడు.

ఏదేదో చెప్పాడు హరి.

సింహం తన సీటు దగ్గరకు రాగానే లేచి నిలబడి రెండు చేతులు తలమీద పెట్టుకున్నాడు హరి.

''చాలా తెలివయినవాడివే.'' అంటూ లాగి 'లెంపకాయ' కొట్టాడు. దెబ్బవెంటనే బుగ్గన ఏదో దాచుకున్నట్లు పొంగింది చెంప.

''మీరు నెలకాగానే కంపెనీ జీతం పందికొక్కుల్లా తినడమేకానీ, మనకింత అన్నం పెడుతున్న కంపెనీకి మేలు చేద్దామనే ఆలోచనే లేదు. మన కంపెనీ తయారుచేసేవే మనకు తెలియకపోతే మనం వాటి గురించి బయటవారికి ఏం చెపుతాం. వాటి సేల్సును ఎలా పెంచుతాం. చాలా అధ్వాన్నంగా వుందే యిక్కడ పరిస్థితి. మీకు రెండు రోజులు టైమిస్తున్నాను. బాగా ప్రిపేరు కాండి. రెండు రోజుల తరువాత సాయంత్రం 5 గంటలకు యిక్కడే సమావేశమవుదాం. ఎవరైనా నేనడిగినదానికి జవాబు చెప్పలేదో, 'నా సామిరంగా' అప్పుడుంటుంది మీకు. ఫోండి....'' అన్న సింహం మాటతో బయటకు వచ్చాము. హరి నారాయణకు చెప్పి స్టోరు రూములోని కంపెనీ తయారుచేసే ఎరువుల, మందుల తాలూకు పుస్తకాలు బండెడు తీసి దుమ్ము దులిపించి యింటికి ఆటోలో బయలుదేరాడు. ''మీరు వెళ్లేది అదే దారికదా గురూ! రా.. ఆటోలో వెళ్దాం'' అన్నాడు. సరేనంటూ నేను అదే ఆటోలో ఒక బండిల్ పుస్తకాలతో బయలుదేరాను. హరి యిల్లు రాగానే ''రా గురూ... కాఫీ తాగి వెళుదువుగాని'' అనడంతో 'సరే' నంటూ పుస్తకాలు ఆటోలోనే వుంచి వాడి యింట్లోకి నడిచాను. ఆటో యింటి ముందు ఆగగానే హరి కొడుకు ఆరేళ్లవాడు ఇంట్లోనుండి పరిగెత్తుకుంటూ వచ్చాడు. హరి ఆటోలోనుండి దిగి పుస్తకాల బండిల్ లోపలికి తీసుకువస్తుంటే ''ఏంటివి నాన్నా అవి''. అని అడిగాడు వాడు. 'అడ్డులేరా' అని వాడిని కసురుతూ పుస్తకాలు లోనికి తీసుకొచ్చాడు హరి. అప్పుడే వాడి దృష్టి హరిగాడి చెంప మీద పడింది.

''నాన్నా. ఏంటి తింటున్నావు.'' అనడిగాడు వాడు.

''ఏమీలేదు పోరా. వెళ్లి మీ అమ్మను మాకు కాఫీ తెమ్మని చెప్పు'' అన్నాడు హరి.

''కాదు. నీవేంటో తింటున్నావ్. నాక్కూడా ఇవ్వు.'' అన్నాడు వాడు.

''ఏమి లేదన్నానా. పో.... తొందరగా వెళ్లి కాఫీ తీసుకురమ్మని మీ అమ్మకు చెప్పు'' మండిపడుతూ అన్నాడు వాడు.

వాడు వినకుండా ఏడ్వసాగాడు. ఇల్లెగిరిపోయేలా ఏడుస్తున్న వాన్ని సముదాయించటం మావల్ల కాలేదు. ఇంతలో హరి భార్య వచ్చింది ఏం జరిగిందంటూ. వాడు ఏడుస్తూ ''చాక్లెట్లు నాన్న ఒక్కడే తింటున్నాడు, నాకీయడం లేదు'' అన్నాడు.

''మీకిదేం పోయేకాలం. చిన్నపిల్లవాడికిద్దామనే ఆలోచనే లేకుండా ఎలా తింటున్నారు. సిగ్గనిపించలేదా?'' అన్నది పెద్దగొంతుతో. హరి తన నోరు తెరిచి చూపించి తానేం తినడంలేదని, వాడు తాను తింటున్నాననుకొని అలా ఏడుస్తున్నాడని చెప్పాడు. ''అవును ఏంటిది. చెంప వాచింది. ఓహో. దారిలో ఏ ఆడదాన్నో చూసి వెకిలిచేష్టలు చేసుంటారు. అది చెప్పుతో చెంప వాయగొట్టివుంటుంది. పిల్లల తండ్రయినా మీకిదేం పోయేకాలం. ఛీఛీ... సిగ్గులేని జన్మ. అయినా మిమ్మల్నని ఏం లాభం. నీలాంటి వాడికి కట్టబెట్టిన మావాళ్లననాలి.'' ఇలా అంతా తనకే తెలిసినట్లు, కొత్త వాడున్నాడనే జ్ఞానం లేకుండా మాట్లాడుతున్న ఆవిడను చూసిన నాకు కంపరం పుట్టింది. ఆడవాళ్లలో కూడా రాక్షసులుంటారని, వారు ఏదేదో ఊహించుకుని, వారు మనశ్శాంతిగా

కవిత



## అశబ్దం

దుఃఖం ఎరగని
ముఖం కోసం వెతుకుతున్నాను

చిర్నవ్వు తరగని
చోటునుండి
పిడికెడు నవ్వుల్ని తీసుకెళ్ళాలి.

వీపున ఎండిన కొమ్మల్లోంచి
రెండు జ్ఞాపకాల
కాయల్ని కోసుకోవాలి.
కళ్ళు తడవడాన్ని
ఆవాహన చేసుకోవాలి.

-ర్యాలి ప్రసాద్

9640945275

వుండక, యితరులను మనశ్శాంతిగా వుండనీయరని, అటువంటివారు పగవాడికి కూడా వద్దని అనుకుంటూ హరికి చెప్పి, బయటపడ్డాను. ఆ రెండు రోజులు దాదాపు అర్ధరాత్రి వరకు చదివాను. ఆఫీసులో భోజన సమయంలో మందుల పేర్లు స్పెల్లింగులతో సహా తన వెంట తెచ్చిన పలకలో రాస్తున్న హరిని, యాభై సంవత్సరాల వయసులో మందుల పేర్లు, ఎరువుల పేర్లను వల్లెవేస్తున్న పరంధామయ్య గారిని చూసినపుడు చాలా బాధేసింది. ఈ విధంగా డిగ్రీలో చదివివుంటే మినిమం ''గ్రూప్ 2'' ఉద్యోగం సంపాదించి వుండేవారమని అనిపించింది. ఆ రోజు ప్రొద్దున ఆఫీసుకు వచ్చిన తరువాత పుస్తకాలు తిరగేస్తుంటే అన్ని తెలిసిపోయినట్లేవున్నాయి. ఇక సింహం కాదు, వాడి బాబొచ్చినా మమ్మల్నేం చేయలేడని అనిపించింది. అదేమాట భోజన విరామ సమయంలో హరితో అన్నాను. ''నీకు తెలియదు గురూ. ఏబ్రాసి గాడిదకొడుకు. ఎక్కడో ఒకచోట మెలిక వేసి, మనలను కోదండం ఎక్కించినా ఎక్కిస్తాడు'' అన్నాడు వాడు. అది వింటున్న రమణి కల్పించుకుని ''కోదండం వేయిస్తే ఆడదాన్ని నా పరిస్థేమిటి?'' అంది భయంగా. అవును కదూ. మా సింహానికి యిటువంటి శిక్షలే తెలుసు గదా. అనుకున్నాను.

సాయంత్రం 5 గంటల కావస్తూండటంతో ఉరికి వెళ్లే ఖైదీల్లా వుంది మా పరిస్థితి. ఠంచనుగా 5 గంటలకు మేము సింహం క్యాబిన్‌లో సమావేశమయ్యాం. ఎందుకయినా మంచిదని హరిగాడు తలుపు దగ్గరున్న కుర్చీలో కూర్చున్నాడు.

''అందరూ బాగా ప్రిపేరయ్యారా.'' చేతిలోని కర్రను పాలిష్ క్లాత్‌తో తుడుస్తూ అడిగాడు సింహం.

ఎవ్వరం సమాధానం చెప్పలేదు. ''అడిగిన దానికి చెప్పకపోయినప్పుడు వుంటుంది ఒక్కొక్కరికి'' అన్నాడు సింహం కర్రను తుడుస్తూ. ఎంతసేపు ఆ కర్రను తుడుస్తాడు అని మనసులో అనుకుంటుండగా, తుడిచిన కర్రను ప్రక్కనున్న బాక్స్‌లోవుంచి, వేరొక కర్ర తీసుకున్నాడు సింహం. కర్రను బాక్స్‌లో పెడుతున్నపుడు అటువైపు చూసిన మాకు అందులో నిండుగా కొట్టొచ్చినట్లు కనపడ్డాయి కర్రలు. అవి చూసినట్లున్నారు పరంధామయ్యగారు. ''భగవంతుడా...'' అంటూ దీనంగా అనడం వినిపించింది నాకు. అన్ని కర్రలను చూసేసరికి రెండు రోజులుగా చదివినవన్నీ మా మైండ్ నుండి హూష్... కాకి అయిపోయాయి. ఎందుకు అన్ని కర్రలు? ఒకటి విరిగితే యింకొకటి వాడటానికా?

''మిస్. రమణి. మన కంపెనీ తయారుచేసే ఎరువులో నత్రజని శాతం ఎంత?'' బాంబు వేశాడు సింహం.

''అయిదు శాతం.'' కళ్లను కర్రపైనుండి మరల్చకుండా సమాధానం చెప్పింది రమణి.

''ఏమిటి?'' ఉరిమాడు సింహం.

''యాభైశాతం...'' గడగడ వణుకుతూ చెప్పింది రమణి.

''ఏమన్నావ్?'' హూంకరించాడు సింహం.

''అయిదు వందల శాతం....'' మూర్ఛపోయే పరిస్థితిలో వుంది రమణి.

''ఇలారా.'' అన్న సింహం మాటను విననట్లే వుంది రమణి.

''ఆడదానివి. నేను అక్కడికి వస్తే బాగోదు. నీవే యిక్కడకు రా. ఈ సారి రాకుంటే నేనే వస్తానక్కడకు.'' బెదిరింపుగా చెప్పాడు సింహం.

తప్పదని లేచి వెళ్లింది రమణి. ''ఇలా ఇంకా దగ్గరకు రా...'' దూరంగా నిలబడి వున్న రమణికి చెప్పాడు సింహం.

ఆవిడ సింహం దగ్గరకెళ్లింది. ఎదురుగా వున్న నాకు ఇప్పుడు రమణి నడుం వరకే కనిపిస్తోంది. నడుం క్రింది భాగం టేబుల్ కవర్ చేస్తోంది. రమణి ఉన్నట్లుండి 'కెవ్వు' మని అరిచింది. కాళ్లు విదిలిస్తూ గెంతుతోంది. అది చూసిన నాకు అక్కడ పామున్నట్లు అది చూసి రమణి గెంతుతున్నట్లు అనిపించి, అసంకల్పితంగా ''పాము... పాము...'' అని అరిచాను. 'పాము' అన్న మాట వినగానే అందరూ తలో దిక్కుకు పరిగెత్తారు. సింహం రెండుచేతులతో రెండు కర్రలు పట్టుకుని టేబుల్‌మీదికి ఎగిరి కూర్చున్నాడు. ఇదే సందని హరిగాడు బయటకు పారిపోవాలని చూశాడు. కానీ, 'మీలాంటి ఉల్ఫాగాళ్లని ఎంతమందిని చూసింటాన్రా' అన్నట్లు సింహం తలుపుకు లాక్ చేసివున్నాడు. అయిదు నిమిషాలు గడిచాయి. ''యింతకు పామెక్కడ. దాన్ని మొదట చూసినవారెవరూ.'' అన్నాడు తన డేగ కళ్లతో చుట్టూచూస్తూ సింహం. అంతా నావైపు చూశారు. ''వాట్ సత్యం. ఎక్కడ చూశావు పామును'' అనడిగాడు సింహం. నేను ''రమణి ఉన్నట్లుండి కేకవేసి, కాళ్లవైపు చూసుకుంటూ గెంతడంతో అక్కడ పాముందని, అందుకే ఆవిడ అలా గెంతుతుందని అనుకొని పామని అరిచాను'' చెప్పాను. సింహం టేబుల్‌మీద నుండి సింహంలా క్రిందకు దూకాడు.

''నీ మెదడు మైక్రోస్కోపుకు కూడా దొరకదని నాకు మొదటినుండి అనుమానమే. అడిగిన దానికి చెప్పలేదని రమణికి 'తొడపాశం' పెట్టాను. అది తట్టుకోలేక రమణి కేక పెట్టి గెంతులేసింది. అది నీలాంటి ఏబ్రాసి ముఖం అర్థం చేసుకోలేదు'' అన్నాడు కూల్‌గా. 'ఓర్నాయనో. వీడెక్కడి వెధవనాకొడుకు. ఎంతలా తొడపాశం పెట్టివుండకపోతే రమణి తట్టుకోలేక అంత గట్టిగా అరిచింది. ఆడదనే కనికరం కూడా లేకుండా ఇలా చేసినోడు యిక మగవాళ్లని మమ్మల్ని వదులుతాడా?'

తరువాత బాంబు నామీద పడనే పడింది. ''మిస్టర్ సత్యం. మన కంపెనీ బ్రాంచీలెన్ని? అవి ఎక్కడ వున్నాయి? వివరంగా గబగబాచెప్పు?'' అన్నాడు సింహం.

ఎంత గింజుకున్నా మెదడులోనికి ఒక్క అక్షరం కూడా రాలేదు.

''నీలాంటి కట్టర్‌గ్యాస్ గాళ్లు, వాళ్లు సక్రమంగా వుండరు. ఇతరులను వుండనీయరు. సమావేశానికి యింతసేపు అంతరాయం కలిగించడమేకాక, అడిగిన వాటికి సమాధానం చెప్పలేని నీలాంటి వాడికి కోదండమే సరి అయిన శిక్ష'' అంటూ సీట్లోనుండి లేచి నా దగ్గరకు రాసాగాడు సింహం. నేను సీట్లోనుండి లేచి వాడికి దొరక్కుండా అటు యిటు పరిగెత్తాను. వాడు కర్రలను నా కాళ్లకేసి విసురుతూ ''కమాన్ హరి వాడిని పట్టుకో.'' అన్నాడు. వాడి మెప్పుకోసం హరిగాడు కర్రలు తగులుతున్నా లెక్కచేయకుండా నన్ను పట్టేసుకున్నాడు.

''రేయ్. నన్ను వదల్రా'' అన్న నా చెంపను చెళ్లుమనిపించాడు హరిగాడు. ''నోర్ముయ్. మనమేమన్నా ఆయనకు శత్రువులమా. మన కంపెనీ సేల్సు పెంచేందుకు, తద్వారా మన జీతాలు పెంచేందుకు కృషిచేస్తున్న ఆయన్ను యిన్ని తిప్పలు పెడతావా. నీకు మనసెలా ఒప్పిందిరా.'' అటూ వాడు నా షర్టుకాలర్ పట్టుకొని ఎడాపెడా వాయించాడు.

''షభాష్ హరి. నీవయ్యా నన్ను కరెక్ట్‌గా అర్థంచేసుకున్నది. ఈడ్చుకురా వాడిని కోదండం ఎక్కిద్దాం'' అంటూ హరిగాడిని ఉత్సాహపరిచాడు సింహం.

''వద్దు...'' ''వద్దు...'' అంటూ గింజుకోసాగాను నేను.

''తాతయ్యా...'' ''తాతయ్యా...'' అంటూ నా మనవడు చిన్ను కుదుపడంతో మెళుకవ వచ్చింది నాకు. వాడు భయం భయంగా చూస్తున్నాడు. వాడ్ని చూసి, చుట్టూ చూశాను నేను. నేను నా యింట్లో, నా మంచం మీద వున్నాను. ఇంతసేపు నేను కలగన్నానని అర్థం అయింది నాకు. అసలు నేను పనిచేసింది కో.ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో. హరి, రమణి, పరంధామయ్య, సింహం లాంటి పేర్లు నా సర్వీసులో ఎప్పుడూ వినలేదు. మరి ఈ కల నాకెందుకొచ్చిందో?

*

*రచయిత సెల్ నెం: 94402 22218*


ఈడు... జోడు... అందం... ఐశ్వర్యం
కళ్యాణం... కాకతీయ!

**కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.**
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్చిస్ వెనుక,
అమీర్‌పేట్, హైదరాబాద్. 500 073.
ఫోన్: 040 - 23747777, 9391999999

**FREE online Registration & Free search**



www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com



అమీర్‌పేట్, కూకట్‌పల్లి, దిల్‌షుఖ్‌నగర్, విజయవాడ, గుంటూరు, తెనాలి, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, ఖమ్మం, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, (చెన్నయ్) టి.నగర్, బెంగుళూర్, సేలం, మధురై, వెల్లూరు, తిరుచి, పాండిచ్చేరి, ఈరోడ్, ఏలూరు

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.